సాక్షి
కాకినాడ

ఆదివారం । 28 । జూలై । 2024



ఇదేమి రక్షణ సత్యదేవా?


ఒకవైపు సుమారు వంద అడుగుల లోయ.. దాని పక్కనే రత్నగిరి నుంచి కొండ దిగువకు వెళ్లేందుకు నిర్మించిన ఆదిశంకర మార్గ్ రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. - 8లో



వడ్డీకాసులవాడా గోవిందా..

నిత్యకల్యాణ గోవిందా.. హరి గోవింద నామస్మరణ వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది. ఆలయం ఆధ్యాత్మిక శోభతో వెలుగొందింది. - 8లో

డెల్టాలకు 9,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 9,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

శృంగార వల్లభునికి రూ.2.38 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సుమారు 12 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.2,38,141 ఆదాయం సమకూరిందని ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశామన్నారు.

ఏలేరులో 11.34 టీఎంసీల నీటి నిల్వలు



ఏలేరులో జలాశయంలో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరిగాయి. ఈ ఏడాది ఎండలకు జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 3,639 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దీంతో పాటు పురుషోత్తపట్నం నుంచి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం నాటికి జలాశయంలో 86.56 మీటర్లకు గాను 78.10 మీటర్ల నీటిమట్టం నమోదైంది. 24.11 టీఎంసీలకు గాను 11.34 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. విశాఖకు 280 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. ఉదయం నుంచీ పెద్ద సంఖ్యలో భక్తులు సత్యదేవుని సన్నిధికి తరలి వచ్చారు. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్టు అధికారులు తెలిపారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవుల చుట్టూ ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 4 వేల మంది భక్తులు సత్యదేవుని అన్న ప్రసాదం స్వీకరించారు.

ఘనంగా ప్రాకార సేవ

రత్నగిరిపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ప్రాకార సేవ శనివారం ఘనంగా జరిగింది. ప్రతి శనివారం స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తున్న విషయం తెలిసిందే. వర్షం వచ్చినప్పుడు పల్లకీ మీద ఆలయం లోపల ప్రాకారంలో ఊరేగిస్తారు. శనివారం వాతావరణం మేఘావృతమై ఉండడంతో ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, వేద పండితులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులపై కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 రోజుల్లో వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రతి ఫిర్యాదునూ పరిశీలిస్తామని చెప్పారు. ప్రధానంగా రెవెన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూ రికార్డుల ఆన్‌లైన్, డ్రైన్లు, కాలువల్లో పూడికల తొలగింపు, శ్మశాన వాటికలకు స్థలం మంజూరు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తాగునీటికి సంబంధించి క్లోరినేషన్ ప్రక్రియను అన్ని గ్రామాల్లో ఒక డ్రైవ్‌లా చేపట్టాలని అధికారులకు కలెక్టర్ షాన్ మోహన్ సూచించారు. సమావేశంలో జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, కాకినాడ కమిషనర్ భావన పాల్గొన్నారు.

● సత్యదేవా.. అడ్డుకోవా..!

ఆన్‌లైన్ బుకింగ్‌లు

- అన్నవరం దేవస్థానంలో దళారీల దందా
- వివిధ సత్రాల్లో 30 శాతం రూములకు ఆన్‌లైన్ రిజర్వేషన్
- వెబ్‌సైట్‌లో ఓపెన్ కాగానే రెండు నిమిషాల్లోనే చేజిక్కించుకుంటున్న వైనం
- వివిధ ఆధార్ కార్డులతో రూముల బుకింగ్
- పర్వదినాలు, వివాహాల సీజన్‌లో ఎక్కువగా ఇదే పరిస్థితి
- అవసరమైన వారికి దొరకని సత్రం గదులు

రైల్వే తత్కాల్ టికెట్లు ఓపెన్ అవగానే నిమిషాల్లో రిజర్వేషన్లు అయిపోవడం చాలామందికి అనుభవమే. కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి టీటీడీ ఆన్‌లైన్ టికెట్లు విడుదల చేయగానే హాట్ కేకుల్లా భక్తులు తన్నుకుపోతూంటారు. ఇదీ అందరికీ తెలిసిందే. సరిగ్గా ఇదే కోవలో అన్నవరం దేవస్థానంలో పలువురు దళారీలు దందా సాగిస్తున్నారు.

అన్నవరం: భక్తవరదుడైన రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి ప్రతి రోజూ వేలాదిగా భక్తులు వస్తూంటారు. పలువురు దేవస్థానం సత్రాల్లో గదులు బుక్ చేసుకుని, రాత్రి బస ఉండి.. మర్నాడు వ్రతాలు, ఇతర పూజలు చేయించుకుని వెళ్తూంటారు. పర్వదినాలు, వివాహాల సీజన్‌లో అయితే రత్నగిరిపై సత్రం గదులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో గదులు లభ్యం కాక అనేక మంది భక్తులు కొండ దిగువన డబ్బులిచ్చుకుని ప్రైవేటు సత్రాల్లో బస చేస్తారు. అంత ఖర్చు భరించలేని వారు గత్యంతరం కొండ పైనే ఎక్కడో ఒక చోట కాలక్షేపం చేస్తూ.. ఇబ్బందులు పడుతూంటారు. ఇలా రత్నగిరిపై అవసరమైన భక్తులకు సత్రం గదులు దొరకకపోవడానికి దళారీల దందాయే కారణమవుతోంది.

ఏం జరుగుతోందంటే..

అన్నవరం దేవస్థానంలో ప్రకాష్ సదన్ మినహా మిగిలిన అన్ని సత్రాల్లో 30 శాతం గదులను ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకునే అవకాశాన్ని భక్తులకు కల్పించారు. వీటిలో రూ.200 చార్జీ చేసే సీతారామ సత్రం నుంచి రూ.1,650 అద్దె కలిగిన శివసదన్ (ఏసీ) వరకూ ఉన్నాయి. దేవస్థానంలోని అన్ని సత్రాల్లోనూ 600 గదులున్నాయి. వాటిలో ప్రకాష్ సదన్‌లోని 64 గదులు మినహా మిగిలినవి 536. వీటిలోనూ 60 గదులు మరమ్మతుల్లో ఉన్నాయి. మిగిలిన 476లో 145 గదులకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఎక్కువగా పర్వదినాలు, వివాహాల సీజన్‌లో అధిక సంఖ్యలో భక్తులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకుంటారు. సంబంధిత వెబ్‌సైట్‌ను అధికారులు నెల రోజులు ముందుగా అర్ధరాత్రి 12 గంటలకు ఓపెన్ చేస్తారు. అలా ఓపెన్ అయిన రెండు మూడు నిమిషాల్లోనే దేవస్థానం సత్రాల్లో ఖాళీగా ఉన్న గదులను రిజర్వ్ అయిపోతున్నాయి. ప్రధానంగా ఎక్కువ మంది దళారీలే వివిధ పేర్లతో ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకుంటున్నారు. దీంతో గదులు అవసరమున్న భక్తులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఆన్‌లైన్ రిజర్వేషన్ ఇలా..

దేవస్థానంలో ఆన్‌లైన్‌లో గదులు రిజర్వ్ చేసుకోవడానికి గూగుల్‌లో ఏపీటెంపుల్స్.ఏపీ.జీఓవీ.ఇన్ అని ఇంగ్లిషులో టైపు చేస్తే సంబంధిత సైట్ ఓపెన్ అవుతుంది. అందులో రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవస్థానాల వివరాలు కనిపిస్తాయి. 'శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, అన్నవరం' మీద క్లిక్ చేస్తే వెంటనే సత్యదేవుని సన్నిధిలో అకామిడేషన్, దర్శనం తదితర ఆప్షన్లు కనిపిస్తాయి. వాటిలో 'అకామిడేషన్' క్లిక్ చేస్తే దేవస్థానంలో వివిధ సత్రాలు, వాటిలో ఖాళీ గదుల వివరాలు కనిపిస్తాయి. వెంటనే ఏ సత్రంలో గది కావాలో క్లిక్ చేస్తే వెంటనే ఆధార్ నంబర్ అడుగుతుంది. ఆ నంబర్ అప్‌లోడ్ చేసిన వెంటనే సంబంధిత ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని అప్‌లోడ్ చేయగానే యూజర్ ఐడీ వస్తుంది. దాని



అన్నవరం దేవస్థానం



ఏపీ టెంపుల్స్ వెబ్‌సైట్

ద్వారా రూము కోసం అప్లికేషన్ వస్తుంది. అందులో వివరాలు పొందుపరచాలి. ఒక ఆధార్ కార్డుతో నిర్దేశిత మొత్తం చెల్లించి, ఒక రూము మాత్రమే రిజర్వ్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఒక యూజర్ ఐడీతో మరో ఆధార్ కార్డు అప్‌లోడ్ చేసి, మరో రూము తీసుకునే అవకాశం కూడా ఉంది.

అంతా నిమిషాల్లోనే..

సాధారణంగా ఎవరైనా సత్రం గదుల రిజర్వేషన్ కోసం ఈ ప్రొసీజర్ అంతా పూర్తి చేసి, రూమ్ రిజర్వ్ చేసుకోవడానికి కనీసం ఐదు నిమిషాలు పడుతుంది. అయితే సైట్ ఓపెన్ అయిన రెండు నిమిషాల్లోనే దళారీలు పలువురి ఆధార్ కార్డులు ఉపయోగించి రూములు రిజర్వ్ చేసేసుకుంటున్నారు. దీంతో మిగిలిన వారికి గదులు దొరకడం లేదు. అంతే కాదు.. ఒక్కోసారి దేవస్థానంలోని ఉద్యోగులకు కూడా ఆన్‌లైన్‌లో గదులు లభ్యం కాని పరిస్థితి. అటువంటి వారికి ఆ దళారీలు ఎర వేసి, దేవస్థానం గదులు ఇస్తూ.. వారి నుంచి అధిక మొత్తాలు గుంజుతున్నారు. వచ్చే నెల ఆరో తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతోంది. ఆ మాసంలో ఎక్కువగా వివాహాలు జరగనున్నాయి. ఆ వివాహ ముహూర్తాలున్న తేదీల్లో ఇప్పటికే 30 శాతం గదులూ రిజర్వ్ అయిపోయాయి.

అలా రిజర్వ్ చేసుకున్న వారు పెళ్లి బృందాలే అనుకుంటే పొరపాటే. దళారీలే పలువురి ఆధార్ కార్డులతో ఈ గదులు హస్తగతం చేసేసుకున్నారు. వివాహాల సీజన్‌లో ఎక్కువగా వివాహాలు జరిగే విష్ణు సదన్ హాల్స్‌కు దగ్గరగా ఉండే హరిహర సదన్‌కు, వివాహాలు చేసుకునేందుకు అవకాశం ఉన్న సీతారామ, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ వంటి సత్రాల్లోను గదులకు చాలా డిమాండ్ ఉంటుంది. దీనిని దళారీలు ఆన్‌లైన్ వేదికగా 'క్యాష్' చేసుకుంటున్నారు.

ఏం చేయాలంటే..

దళారీలకు అడ్డుకట్ట వేసేందుకు దేవస్థానం పలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఎవరి ఆధార్‌తో గదులు రిజర్వ్ చేశారో వారి ఆధార్ కార్డు నకలు ఎవరు తెచ్చి చూపించినా రూము ఇచ్చేస్తున్నారు. దీనికి బదులు ఎవరి ఆధార్ కార్డుతో గది రిజర్వ్ చేసుకున్నారో ఆ వ్యక్తే స్వయంగా సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి (సీఆర్ఓ) వచ్చి, ఆధార్ కార్డు చూపించి, గది తీసుకోవాలనే నిబంధన పెట్టాలని పలువురు సూచిస్తున్నారు. అలాగే, సత్రం గదుల రిజర్వేషన్‌కు గతంలో గది అద్దెలో 150 శాతం వసూలు చేసేవారు. ప్రస్తుతం 100 శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. అంటే సీఆర్ఓకు వచ్చి అద్దెకు తీసుకుంటే ఎంత చెల్లించాలో రిజర్వేషన్ చేయించుకున్నా అంతే మొత్తం చెల్లిస్తున్నారు. దీనిని 150 అంటే అద్దె కన్నా 50 శాతం ఎక్కువ వసూలు చేస్తే దళారీలకు కాస్త అడ్డుకట్ట పడుతుందని అంటున్నారు. దీనివలన దేవస్థానానికి కూడా ఆదాయం వస్తుంది.

దళారీలకు అడ్డుకట్ట వేయాలి



అన్నవరం దేవస్థానంలో ఆన్‌లైన్‌లో వసతి గదులు రిజర్వ్ చేసుకునే భక్తులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొందరు దళారులు వెబ్‌సైట్‌లో రూములు ఓపెన్ అయిన వెంటనే నిమిషాల వ్యవధిలోనే రిజర్వ్ చేసుకుంటున్నారు. అటువంటి దళారీలకు అడ్డుకట్ట వేసి, అవసరమైన భక్తులకే గదులు లభ్యమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొండపల్లి అప్పారావు, భక్తుడు, అన్నవరం

అవసరమైన భక్తులకే గదులు ఇవ్వాలి



దేవస్థానంలోని సత్రం గదులను ఇతరుల ఆధార్ కార్డులతో కొంత మంది దళారీలు చేజిక్కించుకుంటున్నారు. అలా జరగకుండా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలి. గది ఎవరి ఆధార్ కార్డుతో రిజర్వ్ చేస్తే వారు వస్తేనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి.

– సరమర్ల మధుబాబు

ఉరకలేస్తున్న ఉగ్ర గోదారి

- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- నేడు వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం

ధవళేశ్వరం: గోదారమ్మ మళ్లీ ఉగ్రరూపం దాల్చి ఉరకలేస్తోంది. ఎగువ నుంచి భారీగా వచ్చి చేరుతున్న నీటితో ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉధృతి మరోసారి క్రమంగా పెరుగుతోంది. కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక ప్రకటించారు. అనంతరం నీటిమట్టం మరింత పెరుగుతూ రాత్రి 8 గంటలకు 14.10 అడుగులకు చేరింది. దీంతో మిగులు జలాల విడుదలను పెంచారు. బ్యారేజీలోని ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం 175 గేట్లను పైకి లేపి, 13,34,553 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. మరోపక్క ఎగువన భద్రాచలం వద్ద గోదావరి తిరిగి ఉగ్ర రూపం దాల్చింది. అక్కడ నది నీటిమట్టం శనివారం రాత్రి 7 గంటలకు 53.60 అడుగులకు చేరింది. దీంతో ఆదివారం ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతూండటంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ధవళేశ్వరం ఫ్లడ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

పంపా వడి.. జలసవ్వడి



వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న పంపా రిజర్వాయర్

- 100 అడుగులకు చేరిన నీటిమట్టం
- రిజర్వాయర్‌లోకి 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆయకట్టుకు 70 క్యూసెక్కుల విడుదల

అన్నవరం: అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు అన్నవరంలోని పంపా రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా రిజర్వాయర్ నీటిమట్టం శనివారం సాయంత్రానికి 100 అడుగులకు పెరిగింది. ఈ నెల ప్రారంభంలో అడుగంటిన నీటితో దర్శనమిచ్చిన పంపా జలాశయం ప్రస్తుతం జలకళతో పరవళ్లు తొక్కుతోంది. రిజర్వాయర్‌లోకి 250 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూండటంతో నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు. ఇదే తరహాలో వరద నీరు వస్తే నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. పంపా ఆయకట్టుకు 70 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మెయిన్ కెనాల్ ద్వారా 60 క్యూసెక్కులు, సబ్సిడరీ డ్యామ్ ద్వారా 10 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు.

కాలువలకు మరమ్మతులు

వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంపా మెయిన్ కెనాల్‌లో చెట్టు విరిగి పడిపోయింది. దీంతో ఎక్కువ నీటిని కెనాల్ ద్వారా విడుదల చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఆ చెట్టు కొమ్మలు తొలగించి, కాలువకు మరమ్మతులు చేశామని అధికారులు తెలిపారు. దీంతో పంపా కాలువ ద్వారా ఎక్కువ నీటిని ఆయకట్టుకు వదిలేందుకు వీలు కలిగింది.



మరమ్మతులు చేయడంతో పంపా మెయిన్ కెనాల్‌లో పూర్తి స్థాయిలో ప్రవహిస్తున్న నీరు

నీట మునిగిన పుష్కర అక్విడెక్ట్

పంపా నీటిమట్టం పెరగడంతో రిజర్వాయర్ గర్భంలో నుంచి వెళ్తున్న పుష్కర కాలువ అక్విడెక్ట్ మునిగిపోయింది. దిగువ నుంచి పంపాలోకి నీరు వచ్చేలా, పై నుంచి పుష్కర కాలువ ద్వారా నీరు ప్రవహించేలా ఈ అక్విడెక్ట్‌ను నిర్మించారు. మూడు రోజుల క్రితం వరకూ అందరికీ కనిపించిన పుష్కర అక్విడెక్ట్ పంపా నీటిమట్టం పెరగడంతో మునిగిపోయింది.

పంచాయతీరాజ్ డైరెక్టర్ సుడిగాలి పర్యటన

పిఠాపురం: పంచాయతీరాజ్ శాఖ రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజ పిఠాపురం నియోజకవర్గంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత గొల్లప్రోలు మండలం వన్నెపూడి, చెందుర్తి, చేబ్రోలు, ఏకే మల్లవరం తదితర గ్రామాల్లో మంచినీటి పథకాలు, చెరువులను పరిశీలించారు. అనంతరం పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. గ్రామ సచివాలయం సందర్శించి ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలకు ఉపయోగపడేలా సర్వీస్ రోడ్డు నిర్మించాలని సర్పంచ్, గ్రామస్తులు విన్నవించారు. అనంతరం కుమారపురంలో పేదల ఇళ్ల నిర్మాణాలను, గ్రామ సచివాలయాన్ని కృష్ణతేజ సందర్శించారు. తమ ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఎఫ్‌కే పాలెంలో మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. చెత్త నుంచి సంపద కేంద్రం ద్వారా వచ్చే ఆదాయ వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన న్యూ కాలనీలో రోడ్లు నిర్మించాలని, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు. అనంతరం కృష్ణతేజ యు.కొత్తపల్లి మండలంలో కూడా పర్యటించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొనుగోళ్లుమనేలా..

- అలంకారప్రాయంగా నాఫెడ్ కేంద్రాలు
- ఒక్క బస్తా కూడా కొనని వైనం
- ఆన్‌లైన్ నమోదులో మీనమేషాలు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: ఇది నిజంగా నిర్లక్ష్యమే.. కూటమి ప్రభుత్వ చేతికాని తనమే.. కొబ్బరి రైతులను నిండా ముంచే విధానమే.. పంట దిగుబడి రాక, బహిరంగ మార్కెట్‌లో ధర లేక అల్లాడుతున్న రైతులను ఆదుకోవాలనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆశయానికి ఆదిలోనే తూట్లు పొడిచిన వైనమే. సకాలంలో నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం, ఆలస్యంగా తెరిచినా ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయకపోవడం దారుణమే. ఈ–సమృద్ధి యాప్‌లో సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించకపోవడం కొబ్బరి అమ్మకాలకు మోకాలడ్డు పెట్టడమే. ఈ కేంద్రాల్లో కొనుగోళ్లు లేకపోవడం, వినాయక చవితి అమ్మకాలు మొదలైనా బహిరంగ మార్కెట్లో కొబ్బరికి డిమాండ్ రాకపోవడం రైతులకు నష్టమే.

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో వరి తర్వాత ప్రధాన పంట కొబ్బరి. ఆయా జిల్లాల్లో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఒక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 1.03 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. మరో 25 వేల ఎకరాలకు సరిపడే చెట్లు ఇళ్ల వద్ద, కాలువలు, రోడ్ల వెంబడి ఉన్నాయని అంచనా. ఎకరాకు సగటున 7 వేల కొబ్బరి కాయల చొప్పున ఏడాదికి 89.6 కోట్ల కాయల దిగుబడి వస్తోంది. తెల్లదోమ (రూగోస్ వైట్ ఫ్లై) వచ్చిన తరువాత కొబ్బరి దిగుబడి 30 శాతం తగ్గిపోయింది. కొబ్బరి కాయ, కాయలో ఉండే కొబ్బరి సైజు తగ్గింది. ఈ కారణంగా ఉత్తరాది మార్కెట్లో ఇక్కడ పండిన కొబ్బరి పోటీలో నిలబడలేకపోతోంది. తమిళనాడు, కర్ణాటకలో పంట తగ్గినప్పుడు మాత్రమే ఇక్కడి కొబ్బరికి డిమాండ్ వస్తోంది. లేకుంటే ధర గణనీయంగా తగ్గడంతోపాటు ఎగుమతులు నిలిచి రైతుల వద్ద రాశులు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం అంబాజీపేట మార్కెట్‌లో కొబ్బరి నీటికాయ వెయ్యి కాయల ధర రూ.9 వేల నుంచి రూ.పది వేల వరకూ ఉంది. కొత్త కొబ్బరి (ఎండు) క్వింటాల్ ధర రూ.9,500 వరకూ పలుకుతోంది. గడిచిన మూడు నెలలుగా ధరలు ఇంచుమించు ఇలానే ఉండడం గమనార్హం.

ఈసారి ధర లేదు..

కొబ్బరి ధర తగ్గిన సమయంలో నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్) కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరి కొనుగోలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రంలో నాఫెడ్ ఏపీ ఆయిల్ ఫెడ్ ఇంప్లిమెంట్ ఏజెన్సీలో పని చేస్తోంది. నాఫెడ్ కేంద్రాల్లో కొబ్బరి కొనుగోలు చేసినా, చేయకున్నా వీటిని తెరిచిన వెంటనే బహిరంగ మార్కెట్లో ధరలు పెరగడం సర్వసాధారణం. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు. నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేసినా, ఉత్తరాది నుంచి వినాయక చవితి ఆర్డర్లు వస్తున్నా ధర పెరగకపోవడానికి నాఫెడ్ కేంద్రాల్లో కొనుగోలు లేకపోవడమే కారణం.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

నాఫెడ్ కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. ఇందుకు కేంద్రం అంగీకరించడంతో పాటు కేంద్రాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అనుమతులు రాలేదు. నోటిఫికేషన్ అయిన వెంటనే అనుమతులు వచ్చినా స్థానిక అధికారులు వీటిని తెరిచే విషయంలో తీవ్ర జాప్యం చేశారు. తొలుత ఈ నెల 1న కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పారు. కొత్తగా గెలిచిన కూటమి పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీలు అందుబాటులో లేరని, దీనిని ఐదో తేదీకి వాయిదా వేశారు. అప్పుడు కూడా అపాయింట్‌మెంట్ దొరకక చివరకు ఈ నెల 8న అట్టహాసంగా ప్రారంభించారు. ముహూర్తానికి కొనుగోలు చేయడం తప్ప.. ఆ తరువాత ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదు.

ఈ– సమృద్ధిలో నమోదు లేక..

నాఫెడ్ కేంద్రాల్లో కొబ్బరి విక్రయించాలంటే ఉద్యాన శాఖ నుంచి కొబ్బరి సాగు చేస్తున్నట్లు అనుమతి పొందాలి. ఎకరాకు ఆరు నెలలకుగాను 16 బస్తాల (8 క్వింటాళ్లు) చొప్పున ధ్రువీకరణ పత్రం అందిస్తారు. దీనిని తీసుకువచ్చి నాఫెడ్ కేంద్రాల్లోని ఈ–సమృద్ధి యాప్‌లో నమోదు చేయాలి. గతంలో ఈ–క్రాప్‌లో పూర్తి స్థాయిలో కొబ్బరి తోటలు నమోదు కాలేదు. ఇటువంటి తోటల సర్వే నంబర్లు ఈ–సమృద్ధిలో నమోదు కావడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమృద్ధి యాప్‌లో ఈ–క్రాప్ ఆప్షన్ ఎత్తివేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేక కొబ్బరి కొనుగోళ్లు మరింత ఆలస్యం కానుంది. మరోవైపు ఆన్‌లైన్ కాకుండా రాత పూర్వకంగా కొబ్బరి కొనుగోలుకు అనుమతి ఇస్తే అక్రమాలు జరుగుతాయనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



నాఫెడ్ కేంద్రంలో కొబ్బరి కొనుగోళ్లు (ఫైల్)

వచ్చే నెల 1 నుంచి కొంటాం



నాఫెడ్, ఆయిల్ ఫెడ్ సంయుక్త ఆధ్వర్యంలో అంబాజీపేట మార్కెట్ యార్డులో కొబ్బరి కొనుగోళ్లు వచ్చే నెల 1 నుంచి జరుపుతాం. ఆ లోగా నెలాఖరు వరకూ రైతులు తమ పేర్లను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలి. కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 8న ప్రారంభించినా ఈ–క్రాప్ నమోదు పూర్తికాక కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. ఈ–క్రాప్‌కు సమయం పడుతున్న నేపథ్యంలో గవర్నమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ కమిషనర్‌కు లేఖ రాశాం. దాంతో అధికారులు స్పందించి రైతుల వివరాలను మాన్యువల్‌గా నమోదు చేసుకోవచ్చని అవకాశమిచ్చారు.

– సుధాకరరావు, ఏపీ ఆయిల్ ఫెడ్ మేనేజర్

క్లుప్తంగా

పురాతన సంపదను సంరక్షించుకోవాలి



మడ అడవుల సంరక్షణపై మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పురాతన సంపదను సంరక్షించుకోవాలని వాటర్‌మెన్ ఆఫ్ ఇండియా, రామన్ మెగసెస్ అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో శనివారం పీపుల్ వరల్డ్ కమిషన్ ఆన్ డ్రాట్ అండ్ ఫ్లడ్ సంస్థ ఆధ్వర్యంలో మడ అడవుల వారసత్వ సంపద పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్రసింగ్ మాట్లాడుతూ భావితరాలకు పురాతన సంపదను అందజేయాలన్నారు. ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పూర్వ కట్టడాలు, అతి పురాతన సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యూనివర్సిటీలో వృక్ష సంపద, నీటి సంరక్షణకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. వర్సిటీ నుంచి రూ.కోట్ల ప్యాకేజీతో కొలువులు సాధించే విద్యార్థులతో పాటు ప్రకృతి ప్రేమికులను తయారు చేసేందుకు యూనివర్సిటీని తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు నేడూ చెల్లించవచ్చు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు ఆదివారం సెలవు రోజైనప్పటికీ పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విద్యుత్ బిల్లులను చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు, ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలోనూ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

ఇదేమి రక్షణ సత్యదేవా?

- ఆదిశంకర్ మార్గ్‌లో అంతంతమాత్రంగా ఏర్పాట్లు
- రోడ్డు పక్క లోయలో వాహనాలు పడిపోకుండా సర్వే కర్రలతో బారికేడ్లు
- రోడ్డుకు ఎడమ వైపు వంద అడుగుల లోయ
- అందులో వాహనం పడితే ఘోర ప్రమాదం తప్పదు
- వాహనాలకు రక్షణగా రోడ్డు అంచున పిట్టగోడ అవసరం
- ఐరన్ లేదా సిమెంట్ పోల్స్‌తో రక్షణ చర్యలు చేపట్టాలి



ఆదిశంకర మార్గ్ రోడ్డు పక్కన రక్షణగా పాతిన కర్రలు



రోడ్డు పక్కన వంద అడుగుల లోయ

అన్నవరం: ఒకవైపు సుమారు వంద అడుగుల లోతు గల లోయ.. దాని పక్కనే రత్నగిరి నుంచి కొండదిగువకు వెళ్లేందుకు నిర్మించిన 'ఆదిశంకర మార్గ్' రోడ్డు. దీనిపై నిత్యం వందలాది వాహనాలలో ప్రయాణించే భక్తులు. ఇటువంటి చోట భక్తుల వాహనాలు ఏ మాత్రం లోయలో పడిపోయినా జరిగే ఘోరం మన అంచనాకు అందదు. అటువంటి రోడ్డుకు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టాలి? వాహనాలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా లోయ వైపు రోడ్డు అంచున పిట్టగోడ కట్టాలి. లేదా ఇనుప బారికేడ్స్ ఏర్పాటు చేయాలి. లేదా కనీసం సిమెంట్ పోల్స్ అయినా పాతాలి. కానీ దేవస్థానం అధికారులు ఏమి చేశారంటే చలువ పందిర్లు విప్పగా వచ్చిన సర్వీ కర్రలు రోడ్డు అంచున పాతి వాటికి 'డేంజర్' అని స్టిక్కర్ ఉన్న రిబ్బన్ కట్టి ఊరుకున్నారు.

ట్రాఫిక్ ఇబ్బంది అధిగమించేందుకు...

సత్యదేవుని ఆలయానికి వాహనాలలో వచ్చే భక్తులు పెరగడంతో రత్నగిరిపై అటు పార్కింగ్ సమస్యతో పాటు పలుమార్లు ఘాట్ రోడ్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి సీఆర్వో ఆఫీసు పక్క నుంచి దిగువ ఘాట్‌రోడ్ రెండో మలుపునకు కలిసేలా 'ఆదిశంకర మార్గ్' పేరుతో రోడ్డును 2023లో అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ రూ.90 లక్షల వ్యయంతో నిర్మించారు. సత్యగిరి మీద గల సత్రాలలో బస చేసిన భక్తులతో బాటు, ప్రకాష్‌సదన్ వెనుక నిలిపి ఉంచిన భక్తుల వాహనాలను ఆ రోడ్డు మీదుగా దిగువకు పంపిస్తున్నారు. ఈ రోడ్డు వల్ల గత కార్తిక మాసంలో వేల సంఖ్యలో వాహనాలు దిగువకు పంపించే వీలు కలిగింది. ఫలితంగా దేవస్థానంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయింది.

భయం భయంగా..

గతేడాది నుంచి ఈ రోడ్డుకు ఎడమవైపు గల లోయ వల్ల భక్తుల వాహనాలను చాలా జాగ్రత్తగా, భయం భయంగా నడపాల్సి వస్తోంది. ఈ రోడ్డు నిర్మించి సుమారు తొమ్మిది నెలలైనా రక్షణ చర్యలు ఏమీ చేపట్టలేదు.

ఇప్పటికైనా చర్యలు అవసరం

వచ్చే నెల ఆరో తేదీ నుంచి శ్రావణమాసం. పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. వివాహాలకు భారీగా పెండ్లిబృందాలు వస్తాయి. వారంతా రాత్రి వేళల్లోనే వాహనాలలో వస్తారు. దిగువకు వెళ్లేటప్పుడు ఈ రోడ్డు మీదనే ప్రయాణిస్తారు. ఆ తరువాత భాద్రపదమాసంలో పెద్దగా రద్దీ లేకున్నా ఆశ్వీయుజ మాసంలో భక్తుల రద్దీ ఉంటుంది. కార్తికమాసంలో అయితే లక్షలాది మంది భక్తులు విచ్చేస్తారు. వారు దిగువకు వెళ్లడానికి ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డుకు లోయవైపు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

లోయలో వాహనాలు పడిపోయే ప్రమాదం ఉన్నా రోడ్డు అంచున పిట్టగోడ నిర్మించడం కాని, లేదా ఐరన్ బారికేడ్స్ ఏర్పాటు లేదా సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయడం కాని చేయలేదు. తాజాగా లోయ వైపు రోడ్డు అంచున సర్వీ కర్రలు పాతి దానికి డేంజర్ అనే రిబ్బన్ కట్టారు. విచిత్రం ఏమిటంటే ఆ సర్వీ కర్రలు కూడా కొత్తవి కాదు. గత వేసవి కాలంలో దేవస్థానంలో పలుచోట్ల వేసిన చలువ పందిర్లకు వాడినవి. ఆ పందిర్లను వర్షాకాలంలో తీసివేశారు. అప్పటికే ఎండకు ఎండి, వానకు తడిసిన కర్రలను రోడ్డు అంచున బారికేడ్స్‌లా నిలబెట్టారు. గట్టిగా ఒక దెబ్బ కొడితే ఆ కర్రలు పడిపోతాయి. అటువంటివి వాహనాలకు ప్రమాదం జరిగితే లోయలో పడకుండా ఎలా అడ్డుకుంటాయో తెలియదు.

అన్నవరం.. అపురూప దృశ్య కావ్యం



అన్నవరంలో సత్యదేవుని ఆలయం, కొండలు, పంపా రిజర్వాయర్‌తో ప్రకృతి రమణీయ దృశ్యం

అన్నవరం: ప్రకృతి కాంతకు ఎన్నెన్ని హొయలో.. పదం కలిపితే ఎన్నెన్ని లయలో.. అని సినీ రచయిత సిరివెన్నెల రాసినట్టుగా.. ఒక్కో రుతువులో ఒక్కో రకమైన అందాలతో ప్రకృతి కనువిందు చేస్తుంది. ఈ గ్రీష్మ రుతువులో నీలాకాశం ముచ్చట గొలిపింది. ఇటువంటి ఆహ్లాదకర దృశ్య కావ్యం అన్నవరంలో శనివారం ఆవిష్కృతమైంది. ఒకవైపు రత్నగిరిపై సత్యదేవుని ఆలయం, ఇంకోవైపు సత్యగిరిపై దేవస్థానం సత్రాలు, నక్షత్ర వనం, పంపా రిజర్వాయర్, మరోవైపు అన్నవరం గ్రామం అంతా ఒకే చిత్రంలో నీలాకాశం చాటున కనిపిస్తే మనసుకు ఉల్లాసమే. ఈ చిత్రం ప్రకృతి ప్రేమికులను రజింపజేసింది.

వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతా..

- వదంతులు నమ్మవద్దు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: తాను వైఎస్సార్ సీపీ నుంచి వెళ్లిపోతున్నట్లు మీడియాలో వస్తున్న కథనాలు వాస్తవం కాదని ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు అన్నారు. శనివారం స్థానిక విజయలక్ష్మీనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో తాను బీజేపీలో చేరుతున్నానని వచ్చిన కథనాలు సరికాదన్నారు. ఎన్నికల సంగ్రామంలో గెలుపు ఓటములు సహజమన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో తాను నిరంతరం ప్రజలతో మమేకమవుతానన్నారు. ఓటమికి అధైర్యపడే వ్యక్తిని కాదని, నియోజకవర్గంలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో తనకు అభిమానులు ఉన్నారన్నారు. వారి కోసం గతంలో మాదిరిగానే నిరంతరం శ్రమిస్తానన్నారు. పంచాయతీలు, మండల పరిషత్‌లు, మండపేట పురపాలక సంఘం, జిల్లా పరిషత్‌లు వైఎస్సార్ సీపీ పాలనలోనే ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. గత మూడేళ్లుగా చేపట్టిన నియామకాలను, ఉద్యోగాలను ప్రస్తుత ఎమ్మెల్యే కక్షతో రద్దు చేసి పీకించి వేశారన్నారు. బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీల పొట్ట కొట్టడం చాలా దారుణం అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కపిలేశ్వరపురం జెడ్పీటీసీ, ఎంపీపీ పుట్టపూడి అబ్బు, సత్యవేణి, మండపేట ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ, సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, మట్టపర్తి గోవిందరాజు, జుత్తుగ వీరన్న పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో గ్రామాల అభివృద్ధి



శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక ఈటీసీలో ఈ నెల 18 నుంచి 27 వరకూ నిర్వహించిన మూడో బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న జిల్లా పరిషత్, డీపీఓ, డ్వామా, డీఆర్‌డీఏ, ఉపాధి హామీ, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల్లో జిల్లా స్థాయి అధికారులకు మూడు బ్యాచ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆయా జిల్లాల్లోని మండల, గ్రామ స్థాయిలోని అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని వేణుగోపాల్ తెలిపారు. మొదటి బ్యాచ్‌లోని అధికారులకు పేదరికం లేని గ్రామాలు తయారు చేయడం, రెండో బ్యాచ్‌లో అందరికీ విద్య, బాలల వికాసం, మూడో బ్యాచ్‌లో నీటి సమస్య లేని గ్రామాలు తయారు చేయడంతో పాటు మెరుగైన పారిశుధ్య వ్యవస్థను ఏర్పాటు చేయడంపై అవగాహన కల్పించామని ఆయన వివరించారు. ఈ అంశాలను ఆయా గ్రామాల్లో విజయవంతంగా అమలు చేస్తే గ్రామాలు ప్రగతి బాటలో నడుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన అధికారులు వారు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. మూడు రోజుల శిక్షణ అంశాలపై అధికారులకు రాత పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జీఎస్ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నిహారిక, చక్రపాణిరావు, ఎస్ఐఆర్‌డీ అధికారులు నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లాలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శనివారం తెలిపారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, తగాదా, రోడ్డు ప్రమాద, బ్యాంకు కేసులు, రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

వడ్డీకాసులవాడా గోవిందా..



ఆలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

- భక్తులతో పోటెత్తిన వాడపల్లి
- ఒక్క రోజే రూ.33.53 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి

ఆత్రేయపురం: నిత్య కల్యాణా గోవిందా.. హరి గోవింద నామస్మరణ వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది. ఆధ్యాత్మిక శోభతో వెలుగొందింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయానికి ఉదయం నుంచీ రద్దీ నెలకొంది. తొలుత స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.33,53,645 ఆదాయం సమకూరింది. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బదిలీలలెన్నో..

- ఎవరి ప్రయత్నాలు వారివి
- నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో అధికారులు



కాకినాడ సిటీ: కొత్త ప్రభుత్వం వచ్చింది.. ఉద్యోగుల బదిలీల అంశాన్ని తెరపైకి తెచ్చింది.. దీంతో తాము కోరుకున్న ప్రాంతాలకు వెళ్లడానికి అధికారులు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. కాకినాడ జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్‌లను ఇప్పటికే బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఆర్వో స్థాయి నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. జిల్లాలో వివిధ శాఖల అధికారులు ఇప్పటికే మూడు, నాలుగేళ్లకు పైబడి ఒకే స్థానంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరిని బదిలీ చేసేందుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

జిల్లాలో వివిధ విభాగాల అధికారులు బదిలీ అయ్యే పరిస్థితులు కనిపిస్తుండటంతో, తమకు అనుకూలమైన ప్రాంతాల్లో నియమించాలంటూ అధికార పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలా నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. జిల్లాలో ఖాళీగా ఉండి ఇన్‌చార్జులున్న స్థానాలనూ భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులు ఆయా పోస్టుల్లో కొలువుదీరేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శులదీ అదేదారి

గ్రామ పంచాయతీల్లో ఏళ్లకు ఏళ్లు పాతుకుపోయిన పంచాయతీ కార్యదర్శులను కూడా ప్రభుత్వం మార్చాలని చూస్తోంది. ఇప్పటి వరకూ పంచాయతీ కార్యదర్శులు పదేళ్లకు పైబడి ఒకే మండలంలోని గ్రామాలను మార్చుతూ వచ్చారు. ఈసారి వీరు మండల పరిధిని దాటనున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. తమను ప్రస్తుతం ఉన్న పంచాయతీల్లోనే కొనసాగించాలని, లేదంటే మంచి స్థానాల్లో నియమించేలా చూడాలని కోరుతున్నారు. ఈ బదిలీలకు సంబంధించి కార్యదర్శులకు నాయకులు ఒక రేటు ఫిక్స్ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

జీఓ విడుదలతో..

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సొంత జిల్లాలకు చెందిన మండల స్థాయి అధికారులు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సొంత జిల్లాలకు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ విడుదల చేసింది. దీంతో సంబంధిత అధికారుల స్వస్థలం రెవెన్యూ డివిజన్ పరిధిలో లేకుండా ఇతర డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తొలుత కలెక్టర్‌కు రిపోర్టు చేసిన అనంతరం వారికి మండలాలు కేటాయిస్తారు. ఈ ఉత్తర్వులను అనుసరించి మండల స్థాయి అధికారులు వారికి కావాల్సిన ఒకటి, రెండు మండలాలను ప్రధాన అంశాలుగా పెట్టుకుని ఆ దిశగా సంబంధిత ప్రజాప్రతినిధులతో ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏదేమైనా జిల్లా అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు ఈ పనిలో పడ్డారు.